www.nagaranijam.com

PRGI/RNI NO : APTEL/2013/54450

# నగరనిజం జిల్లా అనుబంధం

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

Volume : 13 | Issue : 359 | Rangareddy | Editor : Yela Purushotham | 18 Wednesday,March,2026 | Pages : 4+ | Price : 3/-

## జగ్గారెడ్డిని పిసిసి అధ్యక్షుడిగా చేయాలి: కోమటిరెడ్డి



హైదరాబాద్ మార్చ్ 17 (నగరనిజం న్యూస్ );: ఎప్పుడూ జనంలో ఉండే మాస్ లీడర్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పిసిసి అధ్యక్షుడిగా జగ్గారెడ్డిని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ లాబీలో కోమటి రెడ్డి చిట్ చాట్ చేశారు. జగ్గారెడ్డి మరో పిజెఆర్.. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటారని కొనియాడారు. జగ్గారెడ్డి పిసిసి చీఫ్ అయితే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు వస్తాయని తెలియజేశారు. హామ్ రోడ్ల టెండర్లు ఇంకా ఖరారు కాలేదని, కాంట్రాక్టర్లు రింగ్ అయ్యారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఎలా అంటారు? అని ప్రశ్నించారు. హరీష్ రావు రికార్డుగా మాట్లాడితే అన్నింటికీ జవాబు చెప్తానని, కమీషన్ల కోసమే కాళేశ్వరంలో నాసిరకమైన మోటార్లు ఉపయోగిస్తున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు.

## అభివృద్ధి సంక్షేమ పథకాలు,మౌలిక వసతులు,ప్రణాళికల రూపకల్పనలో జనాభా గణన ఉపయోగ పడుతుంది- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ బ్యూరో: నగర నిజం :మెదక్ జిల్లా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో చార్జి అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినఎ తరువాత నిర్వహిస్తున్న తొలి జనగణన అని, 2011 జనాభా గణన తర్వాత 2021 లో నిర్వహించ వలసిన ఈ ప్రక్రియ కోవిడ్ కారణంగా ఆలస్యంగా జనాభా గణన 2027 లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలలో జనాభా పరంగా,పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, తెలిపారు.జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జన గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు.ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా,తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.జనాభా లెక్కలు సేకరించడం ఒక ముఖ్యమైన బాధ్యతతో పాటు సవాలుతో కూడుకున్న పని అని పేర్కొన్నారు. అందుకు అధికారులు శిక్షణ లో తెలియచేసే ప్రతి విషయాన్ని అవగాహన చేసుకోవాలని,ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని తప్పకుండా గణనలో చేర్చాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలను కూడా గణనలో చేర్చి వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు.ఫీల్డ్ స్థాయిలో కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, పైస్థాయి అధికారులతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించుకుని జనగణనను విజయవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను సి.ఎం.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ చేయడం ,స్వయంగా చేయడం శిక్షణ లో వివరించారు.జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కిసాన్ మేళాలో పాల్గొనాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో : నగర నిజం :మెదక్ జిల్లా వ్యవసాయ శాఖా ఆధ్వర్యంలో 18-03-2026 తేదీన రైతులకు ఉపయోగకరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు "కిసాన్ మేళా" కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం తునికి లో నిర్వహించబడును.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని పంటల దిగుబడి పెంపు, నేల ఆరోగ్యం పరిరక్షణ, సమగ్ర కీటక నియంత్రణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు విధానాలపై రైతులకు మార్గదర్శనం అందించనున్నారు. అదనంగా, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు , రైతు ఆసక్తి గుంపులు కు సంబంధించిన శిక్షణలు మరియు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించబడును. కార్యక్రమంలో వివిధ వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మరియు సంబంధిత సాంకేతిక పరిజ్ఞానంపై ప్రదర్శనలు ఏర్పాటు చేయబడును. రైతులు తమ సమస్యలను నేరుగా శాస్త్రవేత్తలతో చర్చించి పరిష్కారాలు పొందుటకు అవకాశం కల్పించబడును.అందువలన, పరిసర ప్రాంతాల రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.



## బీజేపీ పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతులపై సమీక్ష సమావేశం నిర్వహణ







ఎల్‌బీనగర్, మార్చి 17 (నగర నిజం): బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మార్చ్ 21, 22 తేదీలలో మంగళ్‌పల్లిలోని కెఐఎంటి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 'రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి,' 'బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్‌ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి,' 'జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి,' డివిజన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణ, భవిష్యత్ కార్యపథంపై కార్యకర్తలకు మార్గదర్శనం అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రఘురాం నేత, శంకరయ్య గౌడ్, భూపాల్ రెడ్డి, శ్రీధర్ రావు, ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్ రెడ్డి, రవిశంకర్, మహేష్ గౌడ్, శ్రీనివాస్ శర్మ, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగేష్, మహిళా నాయకురాలు దేవిక, కాంతారావు, ప్రభాకర్ యాదవ్, నరసింహారెడ్డి, శంకరన్న, మహిపాల్ రెడ్డి, గోపి, శ్రీనివాసరావు, కిషోర్, విజయ్, సురేష్ కుమార్, దుర్గాప్రసాద్, శశిహరి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు

### హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో పోలీసుల దాడి?ఆరుగురి అరెస్ట్



నగర నిజం,మార్చి 17 ,సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార వ్యాపారాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. మంగళవారం ఉదయం హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలోని ఒక నివాస గృహంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం స్వర్ణపురికాలనీలోని ఒక ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందగానే అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పంచుల సమక్షంలో సదరు గృహంపై దాడి నిర్వహించారు. ఈ సోదాల్లో వ్యభిచార నిర్వాహకుడు పింటూ అన్సారీతో పాటు విటులు రసిత్ శంకర్, అభిజిత్ బిస్వాస్‌లను పోలీసులు పట్టుకున్నారు.వీరితో పాటు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు యువతులు సహా శిమా షేక్, మేమ్‌ఫుల్ ఖతూన్ అనే మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంటు జ్ఞానేశ్వర్



మొయినాబాద్, మార్చి 17 (నగర నిజం): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మొయినాబాద్ మండలానికి చెందిన నాగిరెడ్డిగూడ గ్రామస్తుడు బంటు జ్ఞానేశ్వరను నియమించారు. ఈ మేరకు నగరంలో పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బంటు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి వార్డుల వారిగా ఎదుగుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ పార్టీ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై మరింత భారం పెరిగిందని పార్టీ కోసం మండల, జిల్లాస్థాయిలో పార్టీని అభివృద్ధి చేసేందుకు తనవంతు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. మారుమూల గ్రామం నాగిరెడ్డిగూడ నుంచి తనను గుర్తించి జిల్లాస్థాయి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలి

**పశు సంపదను పెంచేందుకు అందరూ కృషి చేయాలి**

**గాలి కుంటు నివారణ టీకాలు పశువులకు సురక్షితం**

**వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య**





వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 17 నగర నిజం : వికారాబాద్ మున్సిపల్ కేంద్రంలోని రైతులు తమ పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పశు వైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమం, ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులోని గేదెలకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఏరియా ఆసుపత్రి పశు వైద్య సహాయ సంచాలకులు కె.పూర్ణ చందర్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశు సంపదను పెంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పశువులకు సోకే వ్యాధులను ముందే గుర్తించడం వల్ల పశువుల యాజమానులకు నష్టం రాకుండా చూడవచ్చన్నారు. ముఖ్యంగా గాలి కుంటు నివారణ టీకాలు తీయించుకోవాలని తెలిపారు. ఈ టీకాలు చూడి పశువులకు కూడా సురక్షితమన్నారు. ఈ వ్యాధి పశువులకు సోకితే తీవ్రమైన జ్వరం, పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. 3 నెలలు పై బడిన అన్ని గో జాతి, గేదె జాతి పశువులకు టీకాలు తీయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు వినోద్ కుమార్, రామకృష్ణారెడ్డి, ఎడి డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది హాజీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

**ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్ష విరమించిన కార్మిక నాయకులు నర్ర బిక్షపతి**





నగర నిజం ,పటాన్‌చెరు, మార్చి 17 సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించబడింది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ కార్మిక నేత నర్రా బిక్షపతి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో ఈ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలు తమ ఉపవాస దీక్షలను విరమించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముస్లింల ఆర్థిక అభ్యున్నతికి, వారి సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గంగా–జమున తహజీబ్ సంస్కృతికి ప్రతీకగా అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, సౌహార్ద్రంగా కలిసి జీవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, అలాగే ఇరాన్ ఇరాక్ యుద్ధం ప్రశాంత వాతావరణంలో ఉండాలని అల్లాని కోరమని ఆయన పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇక్బాల్, వాజిద్ అలీ,బాబాసేట్, అఫ్జల్, పాషా, లడ్డు, తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# డ్యూటీ మీట్‌లో మెరిసిన అశోక్ సైబరాబాద్ పోలీస్‌లో ప్రతిభకు ఘన గౌరవం





కుత్బుల్లాపూర్, 17 (నగర నిజం ప్రతినిధి): సైబరాబాద్ పోలీస్ విభాగంలో ప్రతిభకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని మరోసారి నిరూపిస్తూ, ఇటీవల నిర్వహించిన డ్యూటీ మీట్‌లో బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అశోక్ విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో తన నైపుణ్యాన్ని సమర్థంగా ప్రదర్శిస్తూ తృతీయ స్థానం సాధించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీపీ డా. రమేష్ రెడ్డి అశోక్‌ను అభినందించి నగదు పురస్కారం అందజేశారు. విధి నిర్వహణలో చూపిన కృషి, క్రమశిక్షణ మరియు పట్టుదలను కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్కడి వాతావరణం అభినందనలతో నిండిపోయింది.ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, సీటీసీ ఏసీపీ గంగారాం తదితర అధికారులు పాల్గొని అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సహచర సిబ్బంది కూడా ఆయన విజయాన్ని హర్షిస్తూ అభినందనలు తెలియజేశారు.అనంతరం బాలానగర్ సీఐ నర్సింహా రాజుతో కలిసి కానిస్టేబుల్ అశోక్, బాలానగర్ జోన్ డీసీపీ రితి రాజ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీ మరోసారి నగదు పురస్కారం అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ప్రస్తుతం నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందిని గుర్తించి గౌరవించడం ద్వారా ఇతరుల్లోనూ ఉత్తేజం పెరిగి విభాగం మరింత బలోపేతం అవుతుందని అన్నారు.స్థానికంగా కానిస్టేబుల్ అశోక్ సాధించిన ఈ విజయంతో బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు మంచి పేరు తీసుకురావడంతో పాటు, యువ పోలీస్ సిబ్బందికి ప్రేరణగా నిలిచారు.

# క్రీడలకు ప్రోత్సాహం - యువతలో ఉత్సాహం మియాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధం



కుత్బుల్లాపూర్, 17 (నగర నిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని ఆయన అన్నారు.ఈ నెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు మియాపూర్ మెట్రో గ్రౌండ్‌లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా స్థానిక యువ నాయకులు ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆహ్వాన కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రం అందించారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు ఎంతో ప్రేరణనిస్తాయని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయాలంటే ఇలాంటి టోర్నమెంట్‌లు కీలకమని అభిప్రాయపడ్డారు.మియాపూర్ మెట్రో గ్రౌండ్‌లో జరగనున్న ఈ క్రికెట్ పోటీలు యువతలో పోటీ భావనను పెంపొందించడమే కాకుండా, వారి ప్రతిభను వెలికి తీయడానికి మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో అనేక జట్లు పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో యలమంచి ఉదయ్ కిరణ్, నాని, అశోక్, గిరి, రత్నాచారి, నందు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## తాండూర్ శివం స్కూల్ ఆవరణంలో తైక్వాండో స్పీడ్ పంచింగ్, స్పీడ్ కిక్స్ టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులకు మెడల్స్, ధ్రువీకరణ పత్రాల అందజేత





నగర నిజం తాండూర్ ప్రతినిధి మార్చ్ 17 :వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని శివం హైస్కూల్ ఆవరణలో మంగళవారం తైక్వాండో స్పీడ్ పంచ్స్, స్పీడ్ కిక్స్ టోర్నమెంట్ ని మాస్టర్ కుషాల్ అద్వర్యంలో నిర్వహించారు.ఈ టోర్నమెంట్ లో 100మంది క్రీడాకారులు పాల్గొని, స్పీడ్ పంచ్స్, స్పీడ్ కిక్స్ సామర్థ్యాన్ని వినియోగించు కున్నారు. క్రీడాకారుడు ఒక్క నిముషంలో దాదాపు 130స్పీడ్ పంచులు కొట్టారు. ఈ సందర్భంగా క్రీడాకారుల స్పీడ్ ని గుర్తించి.. వారికి మెడల్స్, ధ్రువీకరణ పత్రాలను మాస్టర్ చేతుల మీదుగా అందచేశారు.ఈ టోర్నమెంట్ కి కొడంగల్, పరిగి, తాండూర్ తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు.ఈ కార్యక్రమంలో బుగ్గయ్య, ప్రశాంత్, మహేష్, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# బస్తీ బాటలో బండి రమేష్ - ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర







కుత్బుల్లాపూర్, 17 (నగర నిజం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి కూకట్పల్లి పరిధిలోని ఇంద్రానగర్ బస్తీలో పాదయాత్ర నిర్వహించారు.ఇటీవల ముఖ్యమంత్రి కూకట్పల్లి పర్యటన సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారం కోసం ఆదేశాలు ఇవ్వడంతో రమేష్ ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. బస్తీలో ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ లైన్, త్రాగునీరు, రహదారుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వివరించారు. అదనంగా కొత్తగా విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని కూడా రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ పైప్లైన్ పనులకు ఇప్పటికే అనుమతులు లభించినప్పటికీ మధ్యలో ఆపివేశారని తెలిపారు.దీనిపై స్పందించిన బండి రమేష్, అనుమతులు ఉన్న పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇదిలా ఉండగా, ఈ బస్తీతో పాటు ఐడీపీఎల్‌కు చెందిన భూములను కొంతమంది అక్రమంగా కబ్జా చేసి విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై రమేష్ స్పందిస్తూ, ఐడీపీఎల్ భూముల కబ్జాపై ప్రభుత్వం ఇప్పటికే విచారణ చేపట్టిందని తెలిపారు. విచారణ నివేదిక రాగానే, కబ్జాలో ఎవరున్నా పార్టీలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా ఆక్రమించిన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మధు గౌడ్, సోను, పులి శివ గౌడ్, మధు, నరేందర్, తిరుపతయ్య, సత్యం, శంకర్ గౌడ్, ఏ రాజు, బి రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# దామర్ చెడ్‌లో గ్రామసభ

**సర్పంచ్ ఆధ్వర్యంలో.. ఉపాధిహామీ సామాజిక తనిఖీ**



నగర నిజం తాండూర్ ప్రతినిధి మార్చ్ 17:వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం దామర్ చెడ్ గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 కి సంబందించిన సామాజిక తనిఖీ గ్రామసభని సర్పంచ్ భారతీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రామ సభలో ఉపాధి హామీ పనుల అమలు, కూలీల హాజరు, చెల్లింపులు,పనుల నాణ్యత తదితర అంశాలపై సామాజిక తనిఖీ చేపట్టారు.గ్రామస్థులు తమ అభిప్రాయాలు, సూచనలు,ఫిర్యాదులను నేరుగా తెలియజేశారు.ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకత పెంచడమే లక్ష్యంగా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ఊర చెరువు కాల్వలు, సిద్దప్ప చెరువు పూడిక తీత, ఫీడర్ ఛానల్, ప్లానిటేషన్, నర్సరీ, తదితర పనులు చేయించడం జరిగిందని వివరించారు. గ్రామ సభలో ఉప సర్పంచ్ రవీందర్ కుమార్, వార్డ్ సభ్యులు అనురాధ, నరేష్, వెంకటయ్య, నవనీత, బసమ్మ, అంబికా, భాగ్యమ్మ, గ్రామ పెద్దలు,ఎఫ్ఏ, టిఏ లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భార్వద్ గ్రామంలో ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన

కోట్ పల్లి ఎస్ఐ శైలజ



నగర నిజం తాండూర్ (కోట్‌పల్లి ): మార్చ్ 17:తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా భార్వద్ గ్రామంలో కోట్ పల్లి ఎస్ఐ శైలజ ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పలు సూచనలు తెలియజేశారు.ద్విచక్ర వాహన నడిపే వారు, బైక్ వెనకాల కూర్చున్న వారు ఇద్దరు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. వాహనాలు నడిపే వారు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, ఫోర్ వీలర్ నడిపే వారు తప్పని సరిగా సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు.18 సంవత్సరాల లోపు పిల్లలకు తల్లి దండ్రులు వాహనాలు ఇవ్వరాదని.. వాహనాలు వేగంగా నడపరాదని సూచించారు.సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని.. వాహనాలలో ఓవర్ లోడ్ చేసుకొని వెళ్ళరాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# బండపల్లి గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభించిన

## గ్రామ సర్పంచ్ కోమారి ఉసేనమ్మ



వనపర్తి జిల్లా : నగర నిజం మార్చి 17 (ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు)పానుగల్ మండల పరిధిలోని బండపల్లి గ్రామంలో మంగళవారం నాడు ఉగాది పండుగ పురస్కరించుకొని గ్రామ యువకులు క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ సీజన్ 4 గ్రామ సర్పంచ్ కోమారి ఉసేనమ్మ క్రికెట్ టోర్నమెంట్ను మంగళవారం ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ అదే మ్యాచ్లో 10 జట్లు పాల్గొన్నాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్ కు మొదటి బహుమతి దాత గ్రామ సర్పంచ్ 11111 రూపాయలు.. రెండో బహుమతి ఉపసర్పంచ్ బాబు 6666 రూపాయలు ఇవ్వడం జరిగింది.. ఈ మ్యాచ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్ మాన్ బెస్ట్ బౌలర్ బహుమతులు కే. వెంకటయ్య ఇవ్వడం జరిగింది. ఈ మ్యాచ్ కీ వార్డు మెంబర్స్ ఎల్ఐసి ఏజెంట్ నాగరాజు, జ్యోతి, మినిగీ విష్ణుమూర్తి, దేవేందర్, సహకార దాతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెలుపు ఓటమిలో అందరూ సమానంగా స్వీకరించాలని అన్నారు. ఒకరిపై ఒకరు దృశ్యపమానాలు మాట్లాడుకోవద్దని అందరూ స్నేహభావంగా ఉండాలని వారన్నారు. క్రీడలు ఆరోగ్యానికి చాలా మంచివని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ప్రేమ్ కుమార్, మాజీ వార్డ్ మెంబర్ యుగంధర్, డీలర్ సుదర్శన్, అశోక్ నాయుడు,ఆర్గనైజర్స్ వీరాంజనేయులు, యాలాల శేఖర్, కోకంల నాగశేషి, రాఘవేందర్ నాయుడు, మినీగీ బ్రహ్మ, యువకులు క్రీడ అభిమానులు పాల్గొన్నారు.

# కుంట్లూరులో ఫేస్ లుక్ సృజన కారుల సాంస్కృతిక కేంద్రం

## సృజన కారుల సాంస్కృతిక కేంద్రం ప్రారంభం




హయత్ నగర్, 17, మార్చి (నగరనిజం) : హయత్ నగర్ నుండి కుంట్లూరు మదర్ డైరీ సమీపంలోని రవిశంకర్ కాలనీ రోడ్ నెంబర్ 1లో నాగేశ్వరరావు నేతృత్వంలో నూతనంగా ఫేస్ లుక్ సృజన కారుల సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని స్థానిక కళాకారులు, విద్యార్థుల అభివృద్ధి దృష్ట్యా ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... కళ అనేది సామూహిక ప్రక్రియ అని, గ్రూపుగా కలిసి కళారూపాలను సృష్టించేందుకు వేదికగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమ పిల్లలను తీసుకువచ్చి ఇక్కడ వివిధ కళల్లో శిక్షణ పొందేలా సౌకర్యాలు కల్పించామని చెప్పారు.కేంద్రంలో ఉదయం బోధన సమయం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు, సాధన సమయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు, వేడుకల సమయం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని వివరించారు.

కళలను బోధించే ఉపాధ్యాయులకు గంటకు లేదా నెలకు 1500 రూపాయల కిరాయికి స్థలం అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కేంద్రంలో పుట్టినరోజులు, పెళ్లిరోజులు, చీర కట్టు వేడుకలు, పదవి విరమణ కార్యక్రమాలు, దాండియా నృత్యాలు, నాటికలు, పండుగ వేడుకలు, పూర్వ విద్యార్థుల సమావేశాలు, నూతన సంవత్సర వేడుకలు, హాస్య ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, నృత్యం, కూచిపూడి, యుద్ధకళలు, ధ్వని అనుకరణ, ఏకపాత్రాభినయం, అష్టావధానం, యోగ, బారసాల, గ్రామీణ కళలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా స్టేజి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పాల్గొనే వారు తమ వాయిద్య పరికరాలు భద్రపరచుకునేందుకు లాకర్ సదుపాయం కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9550058639, 8179866338 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# మహనీయుల విగ్రహాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి




సికింద్రాబాద్, 17 మార్చి (నగర నిజం) : ఆర్య నగర్ యూత్ అసోసియేషన్ నాయకులు కుమార్ షాను నేతృత్వంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారును ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వచ్చే నెల ఏప్రిల్‌లో జరగనున్న మహనీయుల జయంతి వేడుకలను పురస్కరించుకుని శాంతినగర్, లాలాపేట, ఇసుక బాయి ప్రాంతాల్లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని కోరారు.విగ్రహాల వద్ద పెయింటింగ్, క్లీనింగ్, వెల్డింగ్ పనులు నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు గౌరవంగా నివాళులు అర్పించేలా విగ్రహాల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్య నగర్ యువకులు కుమార్ షాను, వినోబా నగర్ శ్రీకాంత్, సిబిఎన్ నగర్ అశోక్, కరుణాకర్, పవన్ పాల్గొన్నారు.

# అంబికా నగర్‌లో కోతులు, వీధి కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు వినతి



పెద్ద అంబర్‌పేట్ ,అంబికా నగర్, 17, మార్చి (నగర నిజం) : పెద్ద అంబర్‌పేట్ లోని అంబికా నగర్ కాలనీలో కోతులు మరియు వీధి కుక్కల సమస్య తీవ్రరూపం దాల్చడంతో కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి అత్యవసర వినతి పత్రం సమర్పించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చెట్టుపల్లి అంబేద్కర్ నేతృత్వంలో ఈ వినతి అందజేశారు. కాలనీలో గత కొంతకాలంగా కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లపైకి ఎక్కి పైపులు, విద్యుత్ తీగలను ధ్వంసం చేస్తున్నట్లు నివాసితులు తెలిపారు. ఆహారం కోసం చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులకు దిగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా వీధి కుక్కలు కూడా గుంపులుగా తిరుగుతూ రాత్రివేళల్లో వాహనదారులను వెంటాడుతున్నాయని, పిల్లలు బయటకు రావడానికి భయపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇటీవల కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్నాయని చెప్పారు.ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ మున్సిపల్ సిబ్బంది నుంచి సరైన స్పందన రాలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పరిస్థితి మరింత విషమంగా మారుతోందని విమర్శించారు.ఈ నేపథ్యంలో వెంటనే కోతులను పట్టుకునే బృందాలు, వీధి కుక్కలను నియంత్రించే వాహనాలను పంపించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే కాలనీ వాసులు కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఉగాది -రంజాన్ పండుగల నేపథ్యంలో


## మహబూబ్‌నగర్ వన్‌టౌన్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు






మహబూబ్‌నగర్ జిల్లా నగర నిజం మార్చి 17 (ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు ) మంగళవారం నాడు ఉగాది మరియు రంజాన్ పండుగల సందర్భంగా శాంతి భద్రతలు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, సబ్‌ఇన్స్పెక్టర్ సీనయ్య మరియు పోలీస్ సిబ్బంది కలిసి ముఖ్య ప్రాంతాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా వన్‌టౌన్ పరిధిలోని క్లాక్ టవర్ చౌరస్తా, మసీదులు, ట్యాంక్ బండ్ ప్రాంతం మరియు ఇతర ముఖ్య కూడళ్ల వద్ద డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై తనిఖీలు నిర్వహించారు. ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకునే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా చర్యలు తీసుకుంటోంది.ఈ సందర్భంగా వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, ఉగాది మరియు రంజాన్ పండుగల నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తుందని తెలిపారు.

# ఈతను పాఠ్యాంశంలో చేర్చాలి.. యువత ప్రాణాల కోసం పిలుపు




హయత్ నగర్, 17 మార్చి (నగర నిజం) : ఈతను ఒక ముఖ్య సాధనగా గుర్తించి పాఠశాల పాఠ్యాంశంలో తప్పనిసరిగా చేర్చాలని కోరుతూ పలు వర్గాల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. గత పది సంవత్సరాలుగా ఈ అంశంపై చర్చ కొనసాగుతున్నప్పటికీ, ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఈత తెలియకపోవడం వల్ల చెరువులు, కుంటలు, కాలువలు, నదుల్లోకి వెళ్లినప్పుడు అమాయక యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. వేసవి కాలంలో ఈ ప్రమాదాలు మరింతగా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ వెంటనే స్పందించి పాఠశాల స్థాయిలోనే ఈత శిక్షణను అందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈత నేర్చుకున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా రెండు మార్కులు కేటాయించే విధానాన్ని అమలు చేయాలని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి, ప్రాణరక్షణ నైపుణ్యం అందరికీ అందుబాటులోకి వస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో తల్లిదండ్రులే పిల్లలకు ఈత నేర్పుతున్నప్పటికీ, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పాఠశాలల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా నిపుణుల పర్యవేక్షణలో భద్రతతో ఈత నేర్పే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన స్విమ్మింగ్ పూల్ సౌకర్యాలు, శిక్షకుల నియామకం, భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ఈతను కేవలం వినోదం కోసం కాకుండా ప్రాణాలను కాపాడే అత్యవసర నైపుణ్యంగా గుర్తించాలని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పిల్లలకు చిన్న వయస్సులోనే ఈత నేర్పే విధానాన్ని అమలు చేయాలని సూచిస్తున్నారు.భావితరాల రక్షణ కోసం ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక సంతానం కోసం తల్లి చేసే త్యాగాలను గుర్తు చేసుకుంటూ, యువత ప్రాణాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు పేర్కొన్నారు.

# కర్షకుడికి గుర్తింపు...సేవకు మరో ప్రేరణ

### బహుజన సాహితీ కర్షక అవార్డుకు అందుకున్న బీజేపీ జిల్లా మోర్చా మాజీ నాయకులు



షాద్‌నగర్,మార్చి 17,నగరనిజం: కర్షకుడికి గుర్తింపు...సేవకు మరో ప్రేరణ గా నిలిచారు బీజేపీ సీనియర్ నాయకులు,రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ మోర్చా అధ్యక్షులు,కమ్మదనం ప్రస్తుత వార్డు సభ్యులు ఎన్నం నారాయణ రెడ్డి సోమవారం సర్వంచ్ తిరుపతిలో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ,డాక్టర్ యూ.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని మీడియా కు తెలిపారు.ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారం,గ్రామాభివృద్ధి, మరియు సాహితీ సేవల కోసం ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.సామాజిక సేవలను గుర్తించి ఆయనకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందించారన్నారు.రైతులకు,ప్రజలకు ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్లనే అవార్డు రావడం సంతోషం ఉందన్నారు.

# రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి

## సేంద్రియ ఎరువులను వాడాలి

**సేంద్రియ వ్యవసాయంపై అవగాహనా కల్పించాలి.**

**రైతులకు సేంద్రియ వ్యవసాయ సామాగ్రి కిట్లు,క్యాలెండర్ అందజేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**






షాద్‌నగర్,మార్చి 17(నగరనిజం):రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి,సేంద్రియ ఎరువులను వాడేలా అధికారులు అవగాహనా కల్పించాలని రైతులకు సూచించారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..మంగళవారం రోజున తెలంగాణ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా కేశంపేట మండల రైతులు పాల్గొనడం జరిగిందని కేశంపేట మండలం ఇంచార్జి వ్యవసాయ అధికారి శోభారాణి..మంగళవారం హైదరాబాద్ లోని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం పైన రైతులకి శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు.ఇందులో భాగంగా అధిక ఎరువుల వాడకాన్ని నియంత్రించాలని సేంద్రియ ఆధారంగా పంటలు పండించాలని చెప్పడం జరిగిందన్నారు.అంతే కాకుండా రైతులకు యూరియా యాప్ గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన సామాగ్రి కిట్, క్యాలెండర్ మంత్రి చేతుల మీదుగా రైతులకు అందజేయడం జరిగింది.ఈనెల 22న సిద్దిపేటలో జరిగే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి కేశంపేట మండలం నుండి ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి శోభారాణి,ఏఈఓ వినయ్,రైతులు డిప్యూటీ సర్పంచ్ మల్లేష్,మహేందర్, చెన్నయ్య,కంలీకర్ మహేందర్, పి నర్సింలు,మద్దూరు మల్లేష్ , కే రాజు,శివ కుమార్,యాదయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఐఏఎస్ గోపి ఐఏఎస్,అడిషనల్ డైరెక్టర్ లు విజయ్ కుమార్,నర్సింహ రావు,డి డి ఎ లు చంద్రశేఖర్,ఏ డి ఎ తిరుపతి నాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# 2బిహెచ్‌కే కాలనీల్లో వాణిజ్య సముదాయాల వేలం ప్రక్రియకు సిద్ధం




మేడ్చల్ -మల్కాజ్గిరి, 18 మార్చి (నగర నిజం) : మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లాలోని 2బిహెచ్‌కే కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయించేందుకు అధికార యంత్రాంగం వేగంగా చర్యలు ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 16 కాలనీల్లో ఉన్న 992 వాణిజ్య సముదాయాలను మార్చి నెలాఖరు లోపు వేలం వేయడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు, కాప్రా, నాచారం, దుండిగల్, గాజులరామారం, కీసర, నిజాంపేట్ ప్రాంతాల అసిస్టెంట్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య సముదాయాల విక్రయ ధరను నిర్ణయించేటప్పుడు ప్రస్తుత మార్కెట్ రేటును పరిశీలించి, ఆ ధరను కనీస ధరగా నిర్ణయించాలని సూచించారు.అలాగే వేలం ప్రక్రియలో పాల్గొనే వారికి 3 శాతం నుండి 10 శాతం వరకు ముందస్తు హామీ సొమ్ము జమ చేసే విధంగా నిబంధనలు రూపొందించాలని ఆదేశించారు. ఈ వాణిజ్య సముదాయాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని సంబంధిత 2బిహెచ్‌కే కాలనీల అభివృద్ధి పనులకే వినియోగించాలనే నిబంధనలు అమల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు.కనీస ధర నిర్ణయానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ కన్వీనర్‌గా, అడిషనల్ కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సభ్యులుగా ఉండే కమిటీ ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# -ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక -

## గులాబీ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**బీఆర్ఎస్ సీనియర్ నేత కొలను ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ వైఎన్ఆర్ గార్డెన్‌లో ముస్లిమ్ సోదరులకు ఇఫ్తార్ విందు**

**ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

**ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కార్తీక్ రెడ్డి**






రాజేంద్రనగర్, మార్చి 17(నగరనిజం ప్రతినిధి):రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా తెలంగాణలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక వంటివని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా హిందువులు, ముస్లిం సోదరులు సోదర భావంతో మెలగాలని ఆయన పిలుపునిచ్చారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నేత కొలను ప్రదీప్ రెడ్డి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యుడు) ఆధ్వర్యంలో శంషాబాద్ లోని వై.ఎన్.ఆర్ గార్డెన్ వేదికగా నిర్వహించిన ఇఫ్తార్ విందు వేడుకకు గులాబీ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ మాసం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన అనంతరం కేసీ శ్రీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణలో హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి జీవిస్తున్నారని చెప్పారు. గంగా జమునా తహజీబ్ తరహాలో కుల మతాలకు అతీతంగా ప్రజలంతా సోదర భావంతో మెలగడం అభినందనీయమని కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ప్రజలకు ఆదర్శంగా నిలిచే విధంగా తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించడం అభినందనీయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో కొనసాగిన పదేళ్ల కాలంలో హైదరాబాదులో ఒక్కరోజు కూడా కర్ఫ్యూ వాతావరణం ఏర్పడలేదని, కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించడమే ఇందుకు చక్కని నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రంజాన్ మాసంలో రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించడం పట్ల కార్తీక్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. రంజాన్ పవిత్ర మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కార్తీక్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందని కార్తీక్ రెడ్డి గుర్తు చేశారు. కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తోపాటు గులాబీ పార్టీ నేతలందరినీ ముస్లిం మైనార్టీ నేతలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మరోవైపు రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని తమకు ఇఫ్తార్ విందు ఇచ్చిన గులాబీ పార్టీ సీనియర్ నేత కొలను ప్రదీప్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు చెప్పారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల్ మాజీ ఎంపీపీ ఏనుగు మురళీధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేతలు కొలను ప్రదీప్ రెడ్డి, మంచర్ల మమతా శ్రీనివాస్ (నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్), మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, బూరుకుంట సతీష్ (డిసిసిబి మాజీ డైరెక్టర్),మాజీ కౌన్సిలర్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్ మంచర్ల మోహన్ రావు (శంషాబాద్ మండల్ పార్టీ అధ్యక్షుడు), కూచి రెడ్డి చక్రధర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ మహమ్మద్ గౌస్, చిన్న గండు రాజేందర్, గుంటి చరణ్, వీరమల్లు హనుమంతు ముదిరాజ్, యుగంధర్ రెడ్డి, అల్తాఫ్ తో పాటు తదితర ముస్లిం మైనార్టీ నేతలు మహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాలకు సిద్ధంగా ఉండాలి..

## మాక్ డ్రిల్ నిర్వహణ





మేడ్చల్ -మల్కాజ్గిరి, 18 మార్చి (నగర నిజం) : కర్మాగారాలు, పరిశ్రమల్లో అకస్మాత్తుగా జరిగే రసాయన పేలుళ్లు, లీకేజీలు, బాంబు పేలుళ్ల వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రమాదాలు సంభవించినప్పుడు గాయపడిన వారిని ఎలా రక్షించాలి, పరిస్థితులను ఎలా అదుపులోకి తీసుకురావాలి అనే అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. రసాయన పేలుళ్ల సమయంలో విడుదలయ్యే వాయు కాలుష్య సాంద్రతను బట్టి తీసుకోవాల్సిన చర్యలను దశలవారీగా వివరించారు. పరిస్థితులకు అనుగుణంగా సహజ వాతావరణాన్ని పునరుద్ధరించే విధానాలపై అవగాహన కల్పించారు.ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించే విధానం, రక్షణ చర్యలు, ఫీల్డ్ కార్యకలాపాల్లో విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రమాద స్థలాల్లో పనిచేసే సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక కిట్లు, మాస్కులు, దుస్తులు, గ్లౌజులు ఉపయోగించడం తప్పనిసరి అని తెలియజేశారు. బాధితులను కాపాడడంతో పాటు తమ భద్రతను కూడా ఎలా కాపాడుకోవాలో ప్రత్యక్షంగా చూపించారు.ఇలాంటి ఘటనల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై విపత్తు దళం సభ్యులు సమగ్ర అవగాహన కల్పించారు. మాక్ వ్యాయామంలో ఉపయోగించిన క్లోరిన్ రసాయనం లక్షణాలు, ప్రభావాలు గురించి కూడా వివరించారు. అగ్నిమాపక శాఖ, కర్మాగార శాఖ, వైద్య విభాగం సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ మాక్ డ్రిల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు పోలీసు అధికారులు వెంకట్ రెడ్డి, హనుమంతరావు, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రావతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE